# పచ్చకార్డు చిత్తగించండి

దూరపు కొండలు నునుపు. నునుపే కాదు చటుక్కున చూస్తే పచ్చగా కూడా కనపడతాయి. అవతలివైపు గడ్డికూడా పచ్చగానే వుంటుంది. మరి పొరుగింటి పుల్లకూరో? రుచిగానే కాదు, పచ్చగా కూడా వుంటుంది. అందుకేనేమో అమెరికాలో ఇమ్మిగ్రేషన్ కార్డుని పచ్చకార్డు అంటారు.

* * *

మొన్ననే నాకో అభిమాని దగ్గరనించీ ఉత్తరం వచ్చింది. వారిద్దరి పిల్లలూ అమెరికాలోనే వున్నారుట. ఇంతకు ముందు రెండుసార్లు అమెరికా వచ్చామనీ, నాలుగు నెలలు వున్నామనీ వ్రాశారు. తల్లిదండ్రులిద్దరికీ గ్రీన్‌కార్డుకి అప్లయ్ చేస్తామని అంటున్నారుట పిల్లలు. వారికి అదో సమస్యగావున్నదిప్పుడు. ఈ వయసులో రావాలా వద్దా, వస్తే జీవితం ఎలా వుంటుందని. ఈ ప్రశ్న చాలమందికి వస్తూనే వుంటుంది. దానికి జవాబుకూడా అవును కాదు అని ఒక్క మాటలో చెప్పగలిగేది కాదు. ఈ నిర్ణయం చాల విషయాల మీద, స్వంత విషయాల మీద ఆధారపడివుంటుంది. కాకపోతే ఆ నిర్ణయానికి కావలసిన సమాచారం ఈ రోజుల్లో ఇన్ఫర్మేషన్ హైరోడ్డు మీద దొరుకుతుంది. పక్కనేవున్న చాల ఇళ్ళల్లో కూడా దొరుకుతుంది. ఎందుకంటే ఆ ఇళ్ళనించీ ఎంతోమంది అమెరికాలో వున్నారు కనుక. ఈ ఎన్నారై కబుర్లలో చాల విషయాలమీద చెప్పుకున్నాం కాబట్టి, కొంత సమాచారం వీటిల్లోనూ దొరుకుతుంది. అందుకని ఈ అంశాన్ని మనసులో పెట్టుకుని ఇంతవరకూ రాయని విషయాలనిచూద్దాం. చిత్తగించండి.

* * * *

"మీ పిల్లలిద్దరూ ఇక్కడే పెరిగారు కనుక వాళ్ళు అమెరికాలోనే వుండిపోతున్నారు. మీరు ఇండియా వెళ్ళి అక్కడే రిటైరయిపోవచ్చుకదా?" అని పోతరాజుగారిని అడిగాడొక మిత్రుడు.

"నేను పాతికేళ్ళ క్రితం ఇండియా నించీ అమెరికా వచ్చినప్పుడు నాకు కావలసినవాళ్ళందరికీ దూరమయి వచ్చాను. ఇప్పుడు నాకు ఎంతో ప్రీతిపాత్రమైన పిల్లల్ని ఈ దేశంలో వదిలేసి, నేనక్కడికి వెళ్ళి బావుకునేదేమిటి? మళ్ళీ అదే పని చేయటం నాకిష్టంలేదు" అన్నాడాయన.

మరి తల్లిదండ్రులకి ఎంతో ప్రీతిపాత్రమైన మీరు అమెరికా వచ్చినప్పుడు, వాళ్ళూ అలానే అనుకునివుంటారుకదా. అవును. తప్పకుండాను. ఈ కొండకి ఆ కొండ ఎంత దూరమో, ఆ కొండకి ఈ కొండా అంతే దూరం కదా. నునుపు సంగతి సరేసరి అద్దంలో మనల్ని చూసుకుంటున్నప్పుడు, మనం ఏ రకంగా కనపడాలనుకుని ఆ రకంగా అలంకరించుకుంటే, ఆ రకంగానే కనపడతాం. కాని ఆ అద్దానికి అవతలి వైపున ఏముందో ఏ నాడూ పట్టించుకోం. ఎందుకంటే దానికి మన అలంకరణలతో సంబంధం లేదు కనుక. కానీ నిజజీవితంలో ఆ బంధాలు తెంచుకోలేనివి

కాబట్టి, ఇరుపక్షాలనీ బాధపెడుతూనే వుంటాయి. ముఖ్యంగా, వున్న ఒకళ్ళిద్దరు పిల్లలూ అమెరికాలోనే వుంటే, వయసు పండిన తల్లిదండ్రులకి అటా ఇటా అన్నది ఒక పెద్ద సమస్య.

"ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆవిడ డాక్టరు. ఇద్దరూ బిజీ. ఇక పిల్లల్ని చూసుకునే వాళ్ళెవరు? అందుకే బేబీ సిట్టింగ్ ఉచితమని, వాళ్ళ పేరెంట్స్‌కి గ్రీన్ కార్డ్ ఇప్పించి అక్కడే వుంచుకున్నారు" అంటుండొక అలివేణి.

"అని నేనుకోను. చక్కగా మూడు తరాలవాళ్ళు ఒకే ఇంట్లో కలిసిమెలిసి ఆనందంగా వుంటున్నారు. పిల్లలకి మంచి కంపెనీ. అదీకాక వాళ్ళకి పెద్దవాళ్ళ ద్వారా, తెలుగు మాట్లాడటానికీ, మన జీవితపు విలువలు తెలుసుకోటానికీ అవకాశం వస్తుంది. అలాగే పెద్దవాళ్ళకి కూడా పదేళ్ళుగా దూరమయిన పిల్లలు, ఇప్పుడు మనవలతో సహా దగ్గరవుతున్నారు. అందులో తప్పేముంది?" అని జవాబిచ్చిందొక జమున.

"ఏమో! నాకుమాత్రం అలా అనిపించటం లేదు. ఈరోజుల్లో బేబీ సిట్టింగ్‌కి నెలకి కనీసం ఒక్కొక్క పిల్లాడికీ ఆరేడొందలవుతుంది అదంతా ఆదాయే" అంది అలివేణి.

"దానికికూడా నేను ఒప్పుకోను. పెద్దవాళ్ళ మెడికల్ ఇన్సూరెన్స్ తడిసి మోపెడవుతుంది. అయినా ప్రేమలనీ, అనురాగాలనీ డబ్బులతో కొలవటమేమిటి" అంది జమున, కామెర్లు వచ్చినవాళ్ళకి అంతా "పచ్చ"గానే కనపడుతుంది అని మనసులో అనుకుంటూ.

అమెరికాలో "పచ్చ" కార్డు వున్నా లేకపోయినా, డబ్బుల్ని "గ్రీన్" అనే పచ్చిగా అంటారు.

"మీ పేరెంట్స్‌కి గ్రీన్‌కార్డ్‌కి అప్లయ్ చేస్తున్నారటగా. వాళ్ళిక్కడికి వస్తే బోరు కొట్టదూ. కాలక్షేపం అవుతుందంటారా" అంది కామేశ్వరి బఠానీలు తింటూ.

"మా అమ్మకేమీ దిగుల్లేదు. మా పిల్లలకి తెలుగు నేర్పిస్తుంది. మా నాన్నే ఏం చేద్దామా అని ఆలోచిస్తున్నాడు. ఆయన ఇండియాలో బాంక్‌లో పనిచేశాడు. మరీ బోరుకొడితే ఇక్కడ ఏ బాంక్‌లోనో టెల్లర్‌గా చేరితే అదేకాలక్షేపం" అన్నది అనసూయ.

"ఆఁ! చేరచ్చు. పేరయ్యగారు చేరలేదూ, పెట్రోలు బంకులో. ఆయనా ఇండియాలో పెద్ద గవర్నమెంట్ ఉద్యోగం చేసేవాడు" మనసులో అనుకోబోయి పైకి అనేసింది పేరిందేవి.

అరవింద అంది "ఆరిందలా చెప్పకు. దాంట్లో తప్పేముంది. డిగ్నిటీ ఆఫ్ లేబర్ వుంది అమెరికాలో. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో చదువుకునేటప్పుడు మీ ఆయన పార్కింగ్ లాట్‌లోనూ మా ఆయన ఐస్‌క్రీమ్ షాప్‌లోనూపని చేయలేదూ ఇదీ అలాటిదే"

"మాఆయన ఎప్పటినించో ఏదన్నా బిజినెస్ చేయాలని ఆలోచిస్తున్నాడు. ఆఫీసులో బాగా బిజీ అవటంవల్ల నమ్మకంగా పనిచేసేవాళ్ళ కోసం వెతుకుతున్నా

డు. మా మామయ్యగారూ ఇక్కడికి గ్రీన్‌కార్డ్ మీద వద్దామనుకుంటున్నారు. దీనితో పెద్దాయన ఇక్కడికి వచ్చినట్టుగానూ వుంటుంది మాఆయనకి సహాయం సమస్యా తీరుతుంది" అంది సరళ.

"రైల్వేలో గార్డుగా పనిచేసిన రావుగారు వాళ్ళబ్బాయితో అన్నారు. "పచ్చకార్డుకి పచ్చజెండా మాత్రం చూపించను. నాదేశం వదిలి ఆ పరదేశం రాను. నేను ఇండియాలో పుట్టాను. ఇండియాలో చస్తాను. దట్సాల్ అండ్ దటీజ్ ఫైనల్!"

"వాడు అంతగా రమ్మని అంటుంటే అదేమిటండీ. మనకీ వాడొక్కడే కదా.... " అన్నది వారిజాక్షి.

"అయితే వాడినే వెనక్కి వచ్చేయమను. గ్రీన్‌కార్డుకి అప్లయ్ చేయటానికి నేను మాత్రం ఒప్పుకోనంటే కోనంటే కోను"

"రైలుపట్టాల మీద పట్టుకుందామనుకున్న కుందేలుకి మూడే కాళ్ళుండా లని జీవితమంతా ఎదురుచూస్తున్నారు. ఇక నీ మాటేం వింటారు నాయనా"

* * *

"నాకేమి తోచటం లేదు. అరవై ఏళ్ళు అలవాటయిన ఊరు. మనుష్యులు వాతావరణం. ఇవన్నీ వదిలి అమెరికా వచ్చేయమంటుంది మా అమ్మాయి. నా భార్య పోయినప్పట్నించీ నేనొక్కడినే వుంటున్నాను అబ్బాయీ అమ్మాయీ ఇద్దరూ చెబుతున్నారు, నువ్వొక్కడివి అక్కడేం చేస్తావూ మా దగ్గరికి వచ్చేయ మని" నిట్టూర్చాడు నిరంజనరావుగారు.

"ఇంకొకరి జీవితం గురించి ఉచిత సలహాలు ఇవ్వటం ఉచితం కాదు కనుక నేను మీకేమీ సలహా ఇవ్వటంలేదు. ఇలాటి నిర్ణయాలు వ్యక్తిగతమైనవి. మీకు తెలిసినదే ఒక్క విషయం మాత్రం గుర్తు చేద్దామని వుంచి. మనమందరం తీసుకునే ప్రతిదాంట్లోనూ కొంత తిరిగి ఇవ్వాల్సివుంటుంది. అంటే ప్రతి విషయంలోనూ మీకు ఆనందం కలిగించే వాటితోపాటూ, కొంత కష్టం కలిగించేవీ వుంటాయి. మానవ జీవి తంలో కొన్ని త్యాగాలు తప్పవు. మీరు పిల్లల్ని పెంచి పెద్దజేసి, చదువులు చెప్పించి మీ బాధ్యత నెరవేర్చారు. వారి బంగారు భవిష్యత్తు కోసం వెతుక్కుంటూ వాళ్ళూ అమెరికా చేరారు. వారికి మీరిచ్చిన దాన్ని తిరిగి ఇద్దామని మీ శేషజీవితాన్ని వారితో గడపమని అడుగుతున్నారు. మీకూ జీవితం ఇన్నిదశాబ్దాలుగా ఎన్నోసుఖాలనీ కష్టాలనీ ఇచ్చింది. ఇప్పుడు మీరు తీసుకోవాల్సినది ఒకటి, త్యాగం చేయవలసింది ఇంకొకటి. మీరు అలవాటు పడిన జీవితానికి దూరమయి పిల్లలతో గడపటమా? దూరమయిన పిల్లలు వచ్చి చూసిపోతూనే వుంటారు, అలవాటయిన ఈనేలా ఈ గాలిలోనే శేషజీవితం గడపడమా అన్నది సమస్యే. కానీ పరిష్కారం లేని సమస్య కాదు ఇది అటా ఇటా అనే సమస్యే అయితే, అటూ ఇటూ అనే పరిష్కారం కూడా ఒకటి కాదంటారా?" అన్నాడు కోదండం

* * *